శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబాజీ కీ జై!

సర్వులను, సర్వాన్ని బాబాగా దర్శించిన పురుషోత్తముడు



సుందర వదనారవింద శోభిత దివ్యహాసం.. చూసే కనులను తరింపచేస్తుంది.
ఆయా సన్నివేశాలలో ఆయన ప్రవర్తించిన తీరు, చేసిన బోధలు హృదిలో ముద్రితమై, మనస్సును ఆహ్లాదపరుస్తాయి. జీవన యాత్రలో మార్గదర్శనం చేస్తాయి. ఇలా మనల్ని చేయి పట్టి నడిపిస్తున్న వైనం, మన జీవనంలో చూడగలగడమే ... సాక్షాత్కారం.
కరుణ, పరోపకార పారీణత, సేవాతత్పరత, పాండితీ వైభవం, అపార జ్ఞాన సంపద, హాస్య చతురత, రస హృదయం, సమయస్ఫూర్తి, భగవద్భక్తి, ధీరత, నిర్భీతి, సరళత, నిరాడంబరత, వీటన్నింటిని మించిన ప్రేమ, కారణరహిత ప్రేమ, అవ్యాజమైన ప్రేమ, పరమ ప్రేమ, ఇవన్నీ వారి జీవనంలో నడయాడినవే. ఈ సన్నివేశాలే మన హృదిలో నిలిచిన ఆ ప్రేమముద్రలు... మనకు దారిచూపే పాదముద్రలు – మనం పంచుకునే ఈ అనుభవాలు సద్గురు పదముద్రలు.

– శ్రీ గురుచరణ సన్నిధి

# గురుకృప

ఆరాధనోత్సవ సంచిక – శ్రీరామనవమి 2011

సంపుటి : 14
ఏప్రిల్ 12

# గురుకృప
ఆరాధనోత్సవ సంచిక

సంచిక : 2
2011



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

బంటురీతి కొలువు 3
– గురుకృప

సద్గురువు-జనవరి 5
– శరచ్చంద్రికలు

ఆనందం-ఫిబ్రవరి 8
– శరచ్చంద్రికలు

సమాధి -మార్చి 11
– శరచ్చంద్రికలు

సాయిపథం 15
– గురుకృప

నంబి 21
– గురుకృప



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# బంటురీతి కొలువు.........

సద్గురువంటే ఏమిటి? 'సత్యమే' తానైన సద్గురువు చెప్పదలచినదేమిటి? వారి జీవితం ఏ తత్త్వానికి వ్యాఖ్యానం? వారి బిడ్డలకు ఆయన ప్రసాదించినదేమిటి? మన నుండి వారు ఆశించినదేమిటి?.......

సద్గురువు. సద్గురువంటే – వాచా ఎన్నిసార్లు పలుకుతున్నా, నా వంటి అల్పులకు అవగతమయ్యేది కాదు. అయ్యో! ఎన్నోసార్లు నా స్వామిని గొప్పగా పిలుచుకుంటున్నానే! సద్గురువంటే అసలు ఏమిటి?అని చిన్నారి నా బిడ్డ అడిగాడు, సమాధానం లేదు. ఇంకా ప్రశ్నలు మిగిలాయి. చంద్రశేఖర సరస్వతి స్వామివారు ఒకానొక సందర్భంలో ఇలా చెప్పారు "కుల, మత, భాషా, ప్రాంతీయతలకు తావులేక జగత్తులోని ఏ జీవి అయినా 'సత్య' పదార్థాన్ని తెలుసుకోగోరిన సమయాన ఏదైతే 'సత్య'మో దానిని ఎరుకపరిచే వారిని సద్గురు"వన్నారు, ఉబ్బితబ్బిబ్బయ్యాను స్వామి మాటలు విని. ఆహా! ఏమి నా భాగ్యం – ఎటువంటి నేలపై జన్మించాను–నాడు శంకరుల నుంచి మొదలైన సద్గురుపరంపర–ఎంతటి భాగ్యమో కదా నేడు శరత్ గురు సన్నిధిని చేరాను. కులములేదు – మతము లేదు – జాతి లేదు – దేశము లేదు ఎవ్వరైతే సత్యాన్ని దర్శించాలి అన్న అభిలాషను కలిగి ఉన్నారో, క్షమించాలి, లేని వారిలో కూడా ఆ బీజాన్ని నాటి 'సాయి' అన్న సత్యాన్ని ప్రతి జీవి దర్శించి తరించాలని, సాయి బాటన ప్రజలందరూ చరించాలని తన మనో వాక్కాయ కర్మలను ఏకం చేసి దండము ధరించని సాయి యతీంద్రుని చెంతకు కదా చేరింది. ఏమి ఆ రూపము, ఏమి ఆ జ్ఞానము, ఏమి సంకల్పము, ఏమి ఆశయము, ఏమి ఆచరణ, తన శ్వాసన, ధ్యాసన, మననమున, స్మరణమున సత్యమైన సాయిని నిలుపుకున్న మహర్షీ, మీ పవిత్ర చరణాలకు శత సహస్ర వందనములు.

దశాబ్దాల మీ సాంగత్యం మాకు ఏమి నేర్పిందని అవలోకిస్తే, ప్రభూ! మీ దర్శనం కోసం మేము వస్తే 'సాయిని' మాలో దర్శిస్తున్నానన్న మీ మాటలు మాకు సాయి అనే గమ్యాన్ని చూపాయి. అడుగులో అడుగువేస్తూ సాగే మీ నడక, 'సాయిని' దర్శించే ఆ వైనం, అందరినీ వీక్షించే ఆ వీక్షణం దేహాన్ని దేవాలయంగా ఎలా చూడాలో, ప్రతీ జీవిలో 'సాయిని' ఎలా దర్శించాలోనన్న 'దివ్యత్వాన్ని స్ఫురణకు తెచ్చింది. 'సాయి' నామ ఝురిలో తనువు, మనసు ఎలా 'అర్పణ' కావాలో, 'అహం' స్ఫురణ కరిగి, 'సాయి'లో ఎలా లయమవ్వాలో, ఆ ఆనందస్వరూపునిలో ఎలా నిలవాలో తెలియచెప్పింది మీ దర్శనం. భుజంపై జాలువారుతున్న వస్త్రాన్ని సవరించే ఆ తీరు – 'సద్గురువు'గా, మాకు తల్లిగా, తండ్రిగా మా తప్పటడుగులను సరిదిద్ది, 'సాయిపథాన' నడిపిస్తున్న 'మార్గదర్శి'ని తలపించింది. బిడ్డల ఏ వినతి విన్నా 'బాబా ఉన్నారు' అన్న ఆ మాట, 'తేషాంజ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే'





జ్ఞానిది ఏకభక్తి, అంటే భగవంతుడు తప్ప ఇతరమేదీ లేదన్న గీతా వాక్యాన్ని, సాయి అన్న సత్యమెరిగిన 'సాయి'గా మీ ఉనికిని తెలియచేస్తుంది. ఇలా ప్రతీ కదలిక మాకు ప్రబోధమే అయినా, సద్గురువు త్యాగయ్య "తెలియలేదు రామా! భక్తి మార్గమును" అన్నట్లు మీ గురించి అంతా తెలిసినట్లు ఉంటుంది – ఇంతలోనే 'అవ్యక్త'ంగా వ్యక్తమవుతావు కదా సాయి మహర్షీ! అనుగ్రహవర్షీ!

శ్రీసాయినాధుని శరత్ బాబూజీ అన్న నామధేయం తలచి, ఎన్నో జీవులు వారి చీకటి జీవితాలలో – వెలుగులు నింపుకున్నాయి, స్వాంతన పొందాయి. ఎందరో ఆర్తులు, అర్థార్తులు, పండితులు (ముముక్షువులు), జ్ఞానులు, వారి చెంతన చేరి సందేహ నివృత్తులయ్యారు. సంతోష సాగరాన ఓలలాడారు. 'ఆనందానికి' చిరునామా ఆయన జీవితం. అదొక 'ప్రేమ' సామ్రాజ్యం. పరిధులు లేని ప్రేమకు పెన్నిధానం – శ్రీబాబూజీ సన్నిధానం. అయితే ఇంతటి మహోన్నత వ్యక్తికి ఒక ఐడెంటిటీ (వ్యక్తిత్వం)ఏమైనా ఉందా? ఉంది ఒక్కటే వ్యక్తిత్వం అది సాయితత్త్వం! వారి జీవితం మొత్తం ఒక్కటే ఊసు అది సాయి...సాయి...సాయి... ఎవరైతే ఆచరించి చూపుతారో వారిని ఆచార్యులంది శాస్త్రం. సాయి చూపిన బాటకు సజీవ వ్యాఖ్యానం వారి జీవితం. సద్గురువు తాను చూపిన బాటన బిడ్డలు నడవాలని తహతహలాడటమే కాదు, అందుకు తగు శక్తిని అందించడం. వారి మాతృప్రేమకు తార్కాణం. కృతకారుడు త్యాగరాజు వేడినట్లు "బంటురీతి కొలువియ్యవయ్య రామా! రోమాంచమను ఘనకంచుకము, రామ భక్తుడను ముద్రబిళ్లయు, రామ నామమను వరఖడ్గమిది, రాజిల్లునయ్య త్యాగరాజునికి (బ)"

శ్రీబాబూజీ – వారి జీవిత పర్యంతం ఒక్క ఆశయంతోనే జీవించారు. శ్రీసాయికి నిజమైన బంటులా, ఆయన బిడ్డలా, సాయినిజతత్త్వాన్ని సమాజానికి చేర్చే ఒక సాయివార్తాహరునిలా! దశాబ్దాల పర్యంతం ఒక్కటే మాట! "మనందరికి సాయినాథుడే సద్గురువు, దైవం, గమ్యం కూడా"! నాలాంటి వందలమంది వస్తుంటారంటూ, వారిని ఎప్పుడూ ఒక సుశిక్షుతుడైన సాయి సేవకునిగానే వ్యక్తం చేసుకున్నారు. సత్యాసత్య వివేకం లేని ఒక అల్పునికైనా అవగతమయ్యే ఒక్క విషయం మాత్రం "ఎందరో జీవులను సాయిబాటన నడిపి, శ్రీసాయిని వారి జీవితాల్లో సమున్నతంగా నిలిపి, సాయినామం వినినంతనే రోమాంచమయి, సాయిని సర్వంగా, సాయి ఉన్నారన్న గర్వంగా, తలెత్తుకొని జీవించే అవకాశం అందించిన సాయి ప్రేమమూర్తి శ్రీబాబూజీ" సత్యం.

నాడు త్యాగయ్య రాసిన ఆ భక్తి 'కృతి'కి – శ్రీబాబూజీ మనకు అందించిన ఈ జీవితాలు నిజమైన భాష్యాలు. శ్రీబాబూజీ చెంతకు చేరిన ప్రతివారికి ఆయన 'శ్రీసాయి' అనే ఘన కంచుకాన్ని ప్రసాదించారు. 'బాధ' అన్న పదానికి సాయిభక్తుని జీవితాన చోటు లేకుండా చేసారు. గురుదేవులు వారి ఆచరణలో 'సాయిభక్తు'డనే ఒక వ్యక్తిత్వాన్ని ఎలా సంతరించుకోవాలో





తెలియచెప్పారు. ఆయన చెంతన చేరిన ప్రతీజీవికి సాయినామమనే వరఖడ్గాన్ని ప్రసాదించి, కష్టాలను, దుర్మోహాలను, దురాశలను, అసూయ, ద్వేషాలను, అజ్ఞానాన్ని వధించి విజయపథాన నడిచేందుకు ఒక ఊతమిచ్చారు.

నేడు సమాధాన రూపము ధరించి, దేహాతీతులై ఎందరో జీవులను అనుక్షణము కంటికి రెప్పలా కాపాడుతున్న ఆ సద్గురుచంద్రునిలా మనము సాయికి బంటులవుదాం! మాట్లాడితే ఆయన మాటగా, కీర్తిస్తే ఆయన కృతిగా, మన మనన స్మరణాదులను సాయి ఊసులతోనే సాగిద్దాం. సాయిచూపిన బాటన నడిచి మనమందరం – సద్గురు మహారాజ్ కొలువుకు సంబంధించిన వారమనే ముద్రను సంపాదిద్దాం. ప్రఛండ వేగంగా వీస్తున్న చాంధస భావాలను త్రోసిరాజని 'సాయినామ' ఝురితో జీవితాలను సాఫల్యం చేసుకుందాం.

ఎదురయ్యే అన్ని వికల్పాలను దునిమి – సాయిబంటులమనే ఒక్క సంకల్పానికి అంకితమయి శ్రీ ఖరనామ సంవత్సరాన్ని శ్రీకరంగా, సాయి అనుగ్రహకారకంగా, ప్రేమపూర్వకంగా మార్చుకుందాం. పూజ్య గురుదేవులు అనుగ్రహ విశేషంతో – ఈ సంచిక నుండి 'శరశ్చంద్రికలు' (ఈ మెయిల్ సంచిక) మూడు నెలల సంచికలను ఒక సంపుటిగా 'గురుకృప'లో ప్రచురించుకోవడం జరుగుతుంది. ఇది సాయి సమగ్రదర్శిని www.saibaba.com నుండి సంగ్రహించబడినది. గురూజీ ఆరాధనోత్సవాల సందర్భమున విన్న సి.డి.లోని గురూజీ భాషణాలలోని "సాయిపథం" అనే వ్యాసాన్ని సభక్తిపూర్వకముగా సమర్పిస్తున్నాం.

– *గురుకృప*

# సద్గురువు

**గురువుగారు** : సద్గురువు నీకొకసారి లభించాక, నీ బాధ్యత ఆయన స్వీకరించారని తెలిసాక నీకు కష్టాలెదురైనా ఆయన వున్నారనే భావన నీకు అభయాన్నిస్తుంది. అందువలన నీలోని తపన, నీవు పడే బాధ పూర్వంవలే అనుభవంకాక నీ అనుభవంలో మార్పు వస్తుంది. నీ కోరికలు, సంతోష విషాదానుభూతులలో మార్పు కన్పిస్తుంది. సద్గురువు (అనే) యొక్క ఆ అభయం లభించేదాకా కోరికలు పెరుగుతూ నిన్ను అనంతంగా బాధిస్తాయి. ఆయన లభించిన తర్వాత నీ కోరికల స్వరూపమే మారిపోతుంది. నీకు కోరికలు ఉంటాయి. కానీ అవి ఆయన ద్వారా తీరుతుంటాయి. సమయమాసన్నమయినపుడు ఆ కోరికలు నీ ప్రేమను వ్యక్తీకరించేవిగా రూపుదిద్దుకుంటాయి.

**గురువుగారు** : సద్గురువు ఒక మంచి అధ్యాపకునిలాగా నీలో ఎదగాలనే తపనని, ప్రేమను పెంచుకోవాలనే కోరికను, విమర్శనా సామర్థ్యాన్ని పెంపొందించి, నీలో పరిణితిని తెచ్చి,



వర్ణనాతీతమైన వారి ప్రేమ పూర్ణత్వాన్ని అందిస్తుంది.



నీవు జీవితం యొక్క అర్థాన్ని తెలుసుకొనేలా చేస్తారు. మంచి అధ్యాపకుడెవరైనా బిడ్డకు విషయం అవగతం కాకపోతే నిరుత్సాహపరచరు. ఆమె చిన్నపిల్ల. చిన్నపిల్ల తను పెద్దదాన్నయినానని అనుకుంటే ఇంక అధ్యాపకుని ఉపయోగమేమిటి? అధ్యాపకుడు చిన్న బిడ్డకు, ఆ బిడ్డకున్న పరిమితులను దృష్టిలో ఉంచుకుని బోధిస్తాడు. ఆయన ఎప్పుడూ నిరాశ చెందడు. ఆయన చాలా ఓర్పు కలవాడు.

ఏ సద్గురువూ ఐహిక ప్రపంచం పట్ల విరక్తి కలిగి ఉండమనరు. పైగా ఆయన నీలో నెమ్మదిగా వ్యక్తిత్వ వికాసం కలిగేలా, ఎదగాలనే తపన పెరిగి ఇంకా ఇంకా ఎదిగి పరిపూర్ణ వ్యక్తిగా మారేలాగా ప్రబోధం చేస్తారు. ఆ తర్వాత నీవు నీ బొమ్మలను వదిలివేసి నిజమైన మనుషులతో మెలగడం మొదలుపెడతావు.

మనం మొగ్గకున్న రెక్కలను విడదీసి పువ్వును వికసింపచేయలేము. మొగ్గ పూవులాగా మారడానికి అవసరమైన ఎరువు, నీరు, వెలుతురు మొదలైన వాటిని దానికందచేస్తాము. సద్గురువు చేసేది కూడా నీకు అనుకూల పరిస్థితులను కల్పించడమే. కొంత బోధ చేసి, కొన్ని అలౌకిక అనుభవాలను ప్రసాదిస్తారు. మంచినేల, ఎరువు, మంచినీరు, గాలి, వెలుతురు, రక్షణకు సత్సంగమనే కంచె ఏర్పరచి మొగ్గ పువ్వు అయ్యేలా చూస్తారు. ఆయన రేకులు విచ్చుకునేందుకు మొగ్గను తాకి రేకులను విడదీయరు. రాత్రికి రాత్రే మొగ్గ పూవులా మారాలనుకోరు. అంటే మొగ్గని సహజంగా తగినంత సమయం తీసుకొని పెరిగి పెద్దదై సరైన సమయానికి పువ్వులా మారేలా తనదైన శైలిలో చేయడం ఆయన పద్ధతి.

**గురువుగారు** : వేమన యోగి, "ఇహము లేదు పరము కలదనువాడి మాట కల్లమాట" అని ఒక పద్యంలో అంటారు. ఎవరైనా సరే, 'ఇహము అనేదంతా అశాశ్వతమైనది. మీరదంతా వదిలేయండి. ఆ పరమైనటువంటి పరబ్రహ్మ స్వరూపాన్ని ఎప్పుడూ ధ్యానించి దాన్ని పొందండి" అన్నాడా! వాడు దొంగ. వాడి మాట కల్ల – అంటే అబద్ధం అన్నమాట. వాడికి ఏమీ చేతకాక, ఏమీ చేయలేక వాడి అసమర్ధతను కప్పిపుచ్చడానికి చెప్పే మాట అది. సమర్ధ సద్గురువెప్పుడూ ఆ మాట అనరు. ఇహములోనే పరము చూపేవాడే సద్గురువు. ఆ స్థితిని – దానిని భావాతీతస్థితి అని నీవనుకుంటే – ఆ స్థితిని ఇక్కడికి నీ కోసం తెచ్చి నీకు ఇచ్చినవాడే నిజమైన సద్గురువు. నీవు సంసార బంధాలను, అన్ని వాంఛలను, ప్రపంచాన్ని వదిలి పై మెట్టు మీద ఉన్న నా దగ్గరకు వస్తే ఆ బ్రహ్మానందాన్ని నీకు ప్రసాదిస్తానని ఎవరైనా అంటే ఇక ఆయన ఇచ్చేదేమిటి? సాంసారిక బంధాలను త్యజించలేని, నిచ్చెన ఎక్కిపైకి వెళ్లలేని మనం ఈ ఐహిక ప్రపంచంలో వున్నాము. ఇక ఆయన కోసం పైకి ఎలా వెళ్లగలం? ఆయనే మన చెంతకు స్కందాశ్రమం నుండి గిరిపాదం వద్దకు దిగి వచ్చి ఆ స్థితిని మనకు ప్రసాదించాలి. ఈ





జగత్తులో ఎక్కడ ఉంటే అక్కడకు వచ్చి – మన వాంఛలన్నీ నిర్మూలనం చేసుకోగలిగి ఆయనంత ఎత్తుకు మనం చేరుకోగలిగితే ఇక ఆయన అవసరమేముంది? మన కృషిని గురించిగాని, మనం జపధ్యానాదులు చేస్తున్న తీరు గురించి, మరోదాన్ని గురించిగాని పట్టించుకోక మన దగ్గరకు దిగివచ్చి ఇక్కడే మనల్నిబంధ విముక్తుల్ని చేసేవాడే నిజమైన సద్గురువు. ఏ షరతులకు లోబడని ఆయన కృప మన మీద వర్షిస్తూ ఉంటుంది. తండ్రి తన బిడ్డనెలా ప్రేమిస్తాడో అలాగే సద్గురువు ఆయనకు, మనకు వున్న సంబంధాన్ననుసరించి మనలను ప్రేమిస్తాడు. ఏ తండ్రైనా తన బిడ్డను ప్రేమించే ముందు బిడ్డ అర్హతలను చూస్తాడా? అయినా బిడ్డకు కావలసిన అర్హతలేమిటి? ఆ తండ్రికి బిడ్డగా పుట్టడం మాత్రమే – ఆ ఋణానుబంధమే! ఆ బిడ్డ మంచివాడా, చెడ్డవాడా అని చూడడు. ప్రేమిస్తాడంతే! అలాగే సద్గురువు మనలను ప్రేమిస్తారు. మనమందరం ఆయన బిడ్డలం. ఖచ్చితంగా ఏ విషయంలోనైనా ముందువున్న వారికే ఎంచుకునే హక్కు ఉంటుంది. ఈ తండ్రికి పుట్టాలని నేనితనిని ఎన్నుకున్నానని ఎవరైనా అంటారా? లేదు – అది మన సంకల్పం కాదు. అది ఆయన (బాబా) సంకల్పం. అందుకే బాబా నిర్ద్వంద్వంగా “నా భక్తులను నేనే ఎన్నుకుంటాను” అన్నారు.

సద్గురువు తమ భక్తులను తామే ఎన్నుకుంటారు. భారతీయ సాంప్రదాయంలో శిష్యుడు గురువు వద్దకు వెళ్లి తనను స్వీకరించవలసిందిగా ఆయనను ప్రార్థించి ఆయన అనుమతికై వేచి వుంటారు. గురువును గుర్తించగలగడం మాటలకందని ఒక ఆకర్షణ, ఒక అనుబంధం, ఒక ఇష్టం. అది మనసుకు మాత్రమే తెలుస్తుంది. మనం ఆయన అనుమతికోసం పరితపిస్తాము. అప్పుడు నీకు ఆయనతో అనుబంధ మేర్పడకముందే ఆయన నిన్ను ఎన్నుకొన్నారని, ఆయన ఎన్నుకొన్న తర్వాతే నీవాయనను వెతికి కనుగొన్నావనీ అర్థమవుతుంది.

**గురువుగారు** : బాబా ఎవరు? బాబా అంటే ఏమిటి? ఆయనను మనం ఎలా అర్థం చేసుకోగలం? అనేది ప్రశ్న. ఆయన కంటికి రెప్పలా సదా మనలను రక్షిస్తుంటారు. కావలివానిలా ఎల్లవేళలా మనలను కనిపెట్టుకుని వుంటారు. ఎంతో ఆతురతతో మనం ఎప్పుడు మన వ్యక్తిత్వ పరిమితులనుండి బయటపడి ఆయన ఇవ్వదలచుకున్న దాన్ని ఎప్పుడు అడుగుతామా అని ఎదురుచూస్తుంటారు. ఎప్పుడెప్పుడు వీళ్లు నన్ను అడుగుతారా (ఆయన ఇవ్వదలచుకున్నది) అని ఆశతో నిరంతరం నిరీక్షిస్తారాయన. అదీ – సాయిబాబా అంటే. అంతులేని సహనశీలి. ఆయన మనలను సబూరీ అడుగుతారు. మనం ఇవ్వము కనుక ఆయనే మనకు సబూరీనిస్తారు. అదీ సబూరీ అంటే, (గురువుగారు నవ్వుతూ) మనమివ్వలేనపుడు ఆయనైనా ఇవ్వాలి కదా మరి. ఆయన ఇచ్చి మళ్లీ “ఇవ్వు, ఇవ్వు – కనీసం ఒక్క వాసననైనా వదిలిపెట్టు” అని మరలా పుచ్చుకుంటారు. ఆయన సహనం, పట్టుదల కలవారు. మనమేం చేసినా





సహనం పట్టుదలతో వేచి చూస్తుంటారు. అనుకున్నది సాధిస్తారాయన, అదే సాయిబాబా.

**గురువుగారు** : "ఎవరైనా నా దగ్గరకు ఋణానుబంధంవల్లనే వస్తారు" అన్నారు బాబా. మనందరికి మధ్య గల ఋణానుబంధాన్ననుసరించి నేను మిమ్మల్ని బాబా నాకిచ్చిన ప్రసాదంగా భావిస్తాను. అంతేకాని, మరేదీ కాదు. మీరు పవిత్రంగా చూస్తారో లేదో – అది వేరే విషయం గాని, నాకు మాత్రం మీరంతా బాబా ఇచ్చిన పవిత్రమైన ప్రసాదం. నేను మిమ్మల్ని బాబా ప్రసాదంగా భావించి స్వీకరిస్తాను. బాబా అందరికీ హితమే చేకూర్చుతారు. బాబా మీకు మంచి చేస్తారు. అప్పుడు మీరు, మీతోపాటు నేను సంతోషిస్తాము.

**–శరశ్చంద్రికలు–జనవరి**

## ఆనందం

**గురువుగారు :** ఆనందంపై లగ్నంచేయి. అది చాలు. నీకున్న అవసరం మీద, దానిని (ఆ కొరతగా వున్నదానిని) పొందే మార్గంమీద లగ్నం చేయి. పరిష్కారాన్ని గురించిన ఆ ఆలోచనే నీకానందాన్నిస్తుంది. అదే బాబా దాసగణుమహరాజ్‌ను కాకాసాహెబ్ దీక్షిత్ ఇంటికి పంపించినపుడు ఈశావాస్యోపనిషత్తు ద్వారా ఆయనకు బోధపరచినది. అది ఒక చక్కని బోధ. దాసగణు మహరాజు చాలామంది పండితోత్తములకు సైతం ప్రశ్నార్థకంగా నిలిచిన ఈశావాస్యోపనిషత్తులోని మొదటి శ్లోకానికి సరియైన వ్యాఖ్యానం కోసం తపించిపోయాడు. ఏ పండితుడూ ఆయనకు సంతృప్తికరంగా సమాధానమివ్వకపోవడంతో ఆఖరుకు ఆయన బాబాను అడిగాడు. బాబా తేలికగా, 'ఓ ఇదా నీ ప్రశ్న? నన్నెందుకడుగుతావు? దీక్షిత్ ఇంటికి వెళ్ళు. ఆయన పనిపిల్ల నీకు చెబుతుంది" అన్నారు. దాసగణుకిది చాలా అవమానంగా తోచింది. స్వయంగా తానొక గొప్ప పండితుడు. దానికి తోడు తాను చాలామంది గొప్ప గొప్ప పండితులను సంప్రదించాడు కూడా. వాళ్లు కూడా దానికి సమాధానమివ్వలేకపోయారు. ఇప్పుడతనికి బాబా తనను నిరక్షరాస్యురాలైన దీక్షిత్ పనిపిల్ల దగ్గరకు వెళ్లమని చెప్పి అవమానపరుస్తున్నారనిపించింది. ఏదేమైనా బాబా చెప్పారు కనుక వూరికే దాసగణు బొంబాయి వెళ్ళి అటునుంచి విల్లెపార్లెకు, తర్వాత దీక్షిత్ ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే బస చేసాడు. ఉదయం ఆయన దీక్షిత్ పనిపిల్ల ఆనందంతో చిందులు వేస్తుండటం చూసాడు. ఆయన ఎందుకంత ఆనందంగా వున్నావని ఆమెను అడిగినపుడు ఆమె దీక్షిత్ భార్య తనకు ఒక చీర ఇచ్చిందని అది తన పెట్టెలో వున్నదని అందుకే అంత సంతోషంగా వున్నానని చెప్పింది. ఆమె చీరను ఇంకా ధరించకపోయినా చీర గురించిన ఆలోచనే ఆమెనలా నాట్యమాడేలా చేసింది. అప్పుడు దాసగణు దీక్షిత్ పనిపిల్ల తన ప్రశ్నకు సమాధానమిచ్చిందని గ్రహించాడు. ఆనందంపై లగ్నంచేయి.





**గురువుగారు :** బాబా సంతోషము, పరమానందము యొక్క నిజతత్త్వాన్ని తనదైన చక్కని శైలిలో వివరించారు. కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్లకొక క్రొత్త చీర ఇచ్చారు. ఆమె ఆ చీరను ధరించకుండా ఒక పెట్టెలో భద్రపరచింది. కానీ ఆనందంతో గంతులు వేస్తున్నది. తన క్రొత్త చీర పెట్టెలో వున్నదన్న ఆ ఎరుకే ఆమెకు అంతటి ఆనందాన్ని కలిగించి, ఆ ఆనందంతో నాట్యమాడేలా చేసింది. ఎందుకని? అది అర్థరహితం కదా! ఆమె ఇంకా ఆ చీరను ధరించలేదు. కానీ ఆమె చీర ధరిస్తే ఏమౌతుంది? చీర కట్టుకున్నంత మాత్రంచేత ఆమెకు ఎక్కువ ఆనందం వస్తుందా? లేదు. ఆమెకు ఆ ఆనందం అంతకు ముందే, "చీర నాది, అది నా పెట్టెలో ఉన్నది" అన్న విషయం తెలిసినప్పటి నుంచీ ఉన్నది. ఆమెకు ఆనందమివ్వడానికి ఆ ఆలోచన చాలు. అందుకే ఆమె చాలా ఆనందంతో గంతులు వేస్తున్నది. దానినే ప్రేమ అంటారు. దానినే సాన్నిధ్యమంటారు. అదే గొప్పదైన ఈశావాస్యోపనిషత్తు చెప్పింది కూడా.

చాలామందికి అర్థం కాని విషయమదే. ఆమెకు ఒక చీర ఇచ్చారు. అది ప్రక్కనేవున్న గదిలో వున్నది. కానీ మనకది అవసరంలేదు. **శారీరక అవసరాలు తప్పిస్తే చాలా విషయాలలో మన ఆనందం నిజంగా మనకు అవి వున్నాయన్న ఎరుక మీద ఆధారపడుతుంది కానీ వాటిని పొందడం వలన కాదు.** బ్యాంకులో కొంత డబ్బు వున్నదన్న ఆలోచనే మనకానందాన్నిస్తుంది. మనం నిజంగా ఒక రూపాయి అయినా బ్యాంకు నుంచి (డ్రా) తీసుకుంటామా లేదా అన్నది వేరే విషయం. డబ్బు బ్యాంకులో వున్నది "అది నాది" అన్నది చాలు. మనం చాలా నిశ్చింతగా, ఆనందంగా వుంటాము. అది (డబ్బు) అక్కడ–మనమిక్కడ; అది అక్కడ – మనమిక్కడ వున్నాము (నవ్వులు). దీక్షిత్ పనిపిల్లలాగా : ఆమె చీర ధరించలేదు, మనము డబ్బును ఖర్చుపెట్టలేదు. అది బ్యాంకులో 5,10,15 సంవత్సరాల డిపాజిట్ రూపంలో ఉంటుంది. అయినా మనమానందంగా ఉంటాము.

**గురువుగారు** : ఒక్కసారి "అవును. ఆయన నావారు, ఆయన నాకు చెందినవారు నేను ఆయనకు చెందినవాడిని" అనే ఎరుక వుంటే అది చాలు. (గురువుగారు ఆయన కూర్చుని వున్న గదినుద్దేశించి) నీవు ఇక్కడ కూర్చున్నా, క్రింది అంతస్థులోనైనా, ఒకే గదిలోనైనా, రెండుగదులలోనైనా అక్కడ మధ్యన ఒక గోడ వున్నా సరే తేడా ఏమీ లేదు. నేనిక్కడ కూర్చుని వున్నాను. నీవక్కడ ప్రక్కగదిలోనే కూర్చుని వున్నావు. కాని మనకు గోడ చాలా ముఖ్యమైనదిగా కనబడుతుంది. అందుకే బాబా "అడ్డుగోడను తొలగించ"మన్నారు. నీవక్కడ – నేనిక్కడ. దీక్షిత్ పనిపిల్ల యొక్క చీరలాగా – నేనిక్కడ వున్నాను.

**గురువుగారు** : **నీ యదార్థమైన ఆనందానుభూతి నీవు అనుభవించే వస్తువుపై ఆధారపడిలేదు.**





**దానిపట్ల నీకున్న దృక్పథం (నీ తీరు), ఆ విషయంపట్ల నీ వ్యవహార సరళి, అదే నీకు ఆనందాన్నిస్తుంది.** అందుకే దీక్షిత్ పనిపిల్ల చాలా ఆనందం పొంది సంతోషంతో నృత్యం చేసింది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఉద్యోగం కోసం చూస్తున్నాడనుకుందాం. అతనికి అది అత్యవసరం. తరువాత ఒకరోజు అతనికి ఉద్యోగం వస్తుంది. మొదటి జీతం అతను ఇంకా అందుకోలేదు. అతనికి ఫలానా జీతంతో ఉద్యోగమొచ్చిందని, ఈ-మెయిల్ సమాచారం (Notice) మాత్రం అందింది, అంతే. కానీ, అతడు ఎంతో ఆనందంగా ఉన్నాడు. అతనికి ఏమి జరిగింది? ఆ ఎరుకే ఉద్యోగమున్నది, దానిని తాను పొందగలడనే విషయం అతనిని ఆనందింపచేసింది. అదే - ఎరుకే అతనికి నిజమైన ఆనందాన్నిచ్చింది. అలాగే ఈ ప్రాపంచిక విషయాలపట్ల మాత్రమే కాదు - అదే ఎరుక నీవు వెళ్లి సాయిబాబా వంటి ఒక సద్గురువును కలసినపుడు కూడా వుంటుంది. "అవును - ఇది నా ఈ-మెయిల్ ఉత్తరం (నవ్వులు) నాకు దక్కింది." అనే ఎరుక నీకు చాలా ఆనందాన్నివ్వాలి. నిర్వాణము, ముక్తి, సాక్షాత్కారము - ఏదైనా సరే నీకింకా అందుబాటులోకి రాకపోయినప్పటికీ (ఇంకా పొందనప్పటికీ) ఆ అవకాశము, ఆ వాగ్దానము, అవును నాకు బాబా వున్నారు అనే ఖచ్చితమైన నమ్మకము నిన్ను ఆనందంగా ఉంచాలి. అందుకని మనమంతా కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్లలాగా ఉందాము (నవ్వులు). ఆమెకు చక్కగా చీరవున్నది. మనకు బాబా వున్నారు. ఇంక దుఃఖానికి తావేది? కలత చెందడానికేమున్నది? జీవితాన్ని సంతోషంగా అనుభవిద్దాం. ఆనందంతో ఆస్వాదిద్దాం. నృత్యం చేద్దాం.

**గురువుగారు** : అనుక్షణం, ప్రతి శ్వాసలో ఆనందాన్ని ఆస్వాదిద్దాం. జీవితం మనకొక వరం. అది ఒక శాపం, దౌర్భాగ్యం కాదు. అది ప్రకృతి ప్రసాదించిన ఒక వరం. దాన్ని మనం ఆస్వాదిద్దాం. ఒకవేళ మీరు జీవితాన్ని సంతోషమయం చేసుకోలేక పోయినపుడు సంతోషంగా ఉండడానికి ప్రయత్నించండి. ఎలా సంతోషంగా ఉండాలో అన్వేషించండి. **ఈ సత్సంగాలు మొదలైనవి నీదైన నీ జీవితాన్ని నేర్పుతో ఎలా ఆనందమయం చేసుకోవాలో నీవు నేర్చుకునేలా నీకు నేర్పడానికే వున్నాయి. అపుడు జీవంలేని వెనుకటి పాతక్షణాలు పోయి నీ జీవితం నిత్యనూతనంగా ఉంటుంది. ప్రతిక్షణం - అనుక్షణం నీ జీవితం కొత్తగా ఉంటుంది.**

**గురువుగారు** : బాబా మీకిచ్చిన అందమైన జీవితాన్ని అర్థం చేసుకొని (గుర్తెరిగి) ఆనందంగా ఉండటానికి ప్రయత్నించండి. **అది ఆయన (బాబా) కృపాస్వరూపం.** మీలో ప్రతి ఒక్కరిని బాబా ఎలా ఉంచారు. ఎక్కడ వుంచారు (ఎలా మలచారు), ఆయన మీకు ఏమి ప్రసాదించారు అనేది మీలో ప్రతి ఒక్కరిలో నేను దర్శించుకుంటాను. మీరు ఇంకా ఎక్కువ కోరుకుంటే ఎక్కువ





ఇస్తాను. కానీ బాబా ఇచ్చిన దానిని ఆనందంతో అనుభవించండి, ఆస్వాదించండి.

**గురువుగారు** : తెలుసుకోండి, ఆస్వాదించండి, ఉల్లాసంగా బాబా అనే ఆనందంతో పొంగిపోండి. ఆ ఆనందాన్ని నేను చూడాలి. ఆ సంతోషం నేను చూస్తే నేనూ సంతోషపడతాను. బాబా అనే ప్రేమలో, ప్రేమ అనే ఆ ఆనందంతో ప్రకాశిస్తూ మీ అందరి ముఖారవిందాలు విప్పారిఉంటాయి. **బాబా మీవాడన్న నమ్మకము, నీవు బాబాకు చెందినవాడవన్న అనన్యత్వము వున్న ఆ రాజసం ఉండాలి. మనమంతా శ్రీసాయినాథ్ మహరాజ్ కుమారులం, కుమార్తెలం. ఆయన మహరాజు. (గురువుగారు నవ్వుతూ) మనమూ ఆ రాజవంశీకులమే. మనము రాకుమారులం, రాకుమార్తెలం.** **–శరశ్చంద్రికలు–ఫిబ్రవరి**

# సమాధానం చెప్పే సమాధి

**భక్తుడు** : "సమాధి" అనే పదాన్ని కాస్త వివరిస్తారా?

**గురువుగారు** : ప్రేమానుభూతిని పొందడం, ఆ ఆనందం లేదా పరిపూర్ణత్వం – దానిని మీరెలా పిలిచినా సరే – ఆ స్థితికి అడ్డుపడే అసంకల్పితమైన భావనలు కాని, ఆలోచనలు కాని లేకుండా అందులో పూర్తిగా లీనమై పోవడం. ఆ స్థితే "సమాధి"

**భక్తుడు** : మరి బాబా పార్థివ దేహాన్ని ఉంచిన ప్రదేశాన్ని కూడా "సమాధి" అని ఎందుకంటారు?

**గురువుగారు** : "సమాధి" అన్న పదానికి పలురకాల అర్థాలు వున్నాయి. మొదటి అర్థం – పార్థివ దేహాన్ని ఖననం చేసే ప్రదేశం. మరణించిన ఏ వ్యక్తిని ఖననం చేసిన ప్రదేశాన్నైనా "సమాధి" అనవచ్చు (అంటారు) కాబట్టి ఒక అర్థం సమాధి, గోరి (Tomb) అని. "సమాధి" అంటే సమాధానం పొందిన స్థితి. ఏ స్థితిలోనయితే మనలో అస్పష్టంగా వున్న సంపూర్ణత్వ భావనను అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవాలన్న మన అన్వేషణ ఫలించి, మన అవసరాలన్నీ తీరిపోతాయో, అటువంటి స్థితి – ఇది "సమాధి"కున్న రెండవ అర్థం. మూడవ అర్థం ఏమిటంటే, మనల్ని ప్రక్కకులాగే పరస్పర విరుద్ధమైన భావోద్వేగాలు కానీ, ఆలోచనలు కాని లేకుండా మనలోని భావోద్వేగాలు ఓ పరిపూర్ణ సామరస్యాన్ని పొంది, అలా తన్మయమయ్యే మనస్సు యొక్క స్థితి. ఆ ఆనందకరమైన స్థితిని కూడా "సమాధి" అంటారు.

"సమాధి"కి సరైన అర్థం ఏమిటంటే – ఏ విధమైన సంఘర్షణలు తిరిగి తలెత్తడానికి తావులేకుండా అక్కడితో మన అవసరాలన్నీ సంపూర్ణంగా తీరిపోవడం. విషయం అంతటితో సమాప్తం అన్నమాట. ఇకపై తీరవలసిన అవసరాలు కాని కోరికలు కానీ వుండవు. అందుచేత ఇకపై ఎటువంటి వైరుధ్యాలు తిరిగి తలెత్తడానికి కారణమైన బీజాలు కూడా ఉండవు. మామూలుగా





భౌతికంగా చూస్తే మరణమనేది (జీవితానికి సంబంధించిన) జీవితం యొక్క శారీరక అవసరాలను తీరుస్తుంది లేదా పరిష్కరిస్తుంది. కాబట్టి మరణించిన తరువాత ఖననం చేసిన ప్రదేశాన్ని "సమాధి" అంటారు. కాని పారమార్థిక దృష్టితో చూస్తే మన యొక్క పారమార్థిక అవసరాలు అన్నీ సమాధానపడి సంపూర్ణత్వం పొందిన స్థితి ఏదైతేవుందో, ఏ స్థితిలోనైతే మనలోని అస్పష్టమైన పరిపూర్ణత్వం ఒక విస్పష్టమైన రూపాన్ని సంతరించుకుని పూర్ణత్వస్థితి మనకు అనుభవమవుతుందో అదీ "సమాధి". అందుకని సమాధి అనే పదాన్ని వివిధ రీతులలో ఉపయోగించవచ్చు.

బాబా "సమాధి"లో వున్నారు. ఆ చైతన్యస్థితిలో ఉన్నారు. మనము ప్రత్యక్షంగా చూచే బాబా సమాధిస్థానం ఆయన భౌతిక దేహాన్ని ఖననం చేసిన ప్రదేశం కాబట్టి అది ఆయన "సమాధి". మనం అక్కడకి వెళ్లినపుడు మన అవసరాలు సమాధానపడి మనం పొందే అనుభవం "సమాధి". ఇలా బాబా సమాధికి "సమాధి"కి వున్న అన్ని అర్థాలు వర్తిస్తాయి. అందుకనే, బాబా, "నా సమాధి సమాధానమిస్తుంది!" అన్నారు. ఆయన పరిపూర్ణస్థితి భక్తుల వివిధ రకాల అవసరాలు తీరుస్తుంది. అది సమాధానమిచ్చే సమాధి.

**గురువుగారు** : 1918కి ముందు కూడా బాబా తమ దేహానికి పరిమితమై లేరు. ఎందుకంటే బాబానే స్వయంగా, **"నా ముర్షద్ (గురువు) నన్నేనాడో ఈ దేహం నుండి విడుదల చేసారు. ఎవరైతే ఈ దేహాన్నే సాయిబాబా అనుకుంటారో వారు సాయిబాబానసలు చూడనట్లే"** అని చెప్పారు. తమ దేహం నుండి ఆయన అప్పటికే విడుదలయ్యారు కనుక నిజానికి ఆయన దేహం ఒక సమాధి – కొద్దిమందితో వ్యవహరించగల పరిమితమైన కదలాడే ఒక చిన్న సమాధి. ఆయన ప్రేమ స్వరూపులు, భక్తుల సంఖ్య పెరుగుతున్న అవసరాలు తీర్చాలనుకున్నవారు కనుక, భక్తులు ఆయనతో వ్యవహరించడానికి ఒక ఆలంబన కావాలి కనుక తరువాత ఆయన మారవలసి వచ్చింది. అందుకని ఆయన తమ సమాధిని మార్చుకున్నారు. ఆ సమాధి (ఆయన భౌతిక శరీరం) నుంచి తమ దేహం యొక్క ఆకారం యొక్క పరిధిని పెంచి ప్రస్తుతం వున్న సమాధికి మారారు. అందుకనే, ఆయన **"నా సమాధి మాట్లాడుతుంది, నా సమాధి కదులుతుంది, నా సమాధి సమాధానం చెబుతుంది"** అన్నారు, అంతకుముందు ఆయన భౌతికదేహం సమాధానమిస్తూ వుండిన రీతిలోనే.

**గురువుగారు** : మనం బాబా రూపాన్ని చూచి ఆయన ఒక సద్గురువు అని భావిస్తాము. కానీ ఏ లక్షణాలను అనుసరించి (అలా అనుకుంటాము?) ఆయన ఒక ప్రత్యేకమైన స్థితిలో ప్రకటమైనారు కనుక. ఆ స్థితి ఆయనకు సద్గురువు అనే స్థాయిని ఇస్తుంది. ప్రధానమైనది ఆయన రూపం





కాదు, ఆయన స్థితి. అందుకనే బాబా పదే పదే **"నేనీ దేహాన్ని కాదు, నేనీ రూపం మాత్రమే కాదు. ఈ శరీరం ఏదో ప్రకటనమవడానికి ఒక సాధనం, ఒక సమాధి మాత్రమే"** అంటుండేవారు. మనకు ఆ స్థితి ఒక స్పష్టమైన మార్గం ద్వారా తెలియచేస్తే కానీ బోధపడదు. కనుక ఆ స్థితి సాయిబాబా రూపంగా ప్రకటమైంది.

**భక్తుడు** : గురువుగారూ! ఈ రోజు భగవాన్ రమణుల వర్ధంతి. ప్రస్తుతం ఈ రోజును ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు, మరి ఏభై సంవత్సరాల క్రితం ఆయన దేహాన్ని వదిలిపెట్టినపుడు ఆయన సాన్నిధ్యాన్ని కోల్పోయిన భక్తుల పరిస్థితి ఇలా ఉండదు కదా! అందుచేత ఈరోజు ఎంత పవిత్రమైన రోజైనా అప్పుడున్న ఆయన భక్తులకు వారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఆయన శరీరం లేకుండా పోయినపుడు ఎలా ఉండి ఉంటుందని ఆలోచిస్తే ఖచ్చితంగా వేదనాభరితంగానే ఉంటుంది కదా!

**గురువుగారు** : ఆయన విదేహులైన రోజు భక్తులకు ఎంతో విషాదకరమైన రోజు. అందులో సందేహం లేదు. కానీ తరువాత, సాధారణంగా భారతదేశంలో మహాత్ములు సమాధిచెందిన రోజును సంతాపదినంగా కాక ఉత్సవంలా జరుపుకుంటారు. ఎందుకంటే మహాత్ములకు మరణం లేదని వారికి తెలుసు. అప్పటి భక్తులకు తమ సద్గురువు భౌతిక దేహంతో ఉన్నపుడు గల వ్యక్తిగత సాన్నిహిత్యం వల్ల ఆయన దేహత్యాగం చేసిన రోజున వారు ఎంతో బాధతో విలపించారు. అది సహజం. అది వారికి అత్యంత విషాదకరమైన రోజు. మహాత్ముల భౌతిక శరీరంతో భక్తులకు గల వ్యక్తిగత సంబంధం వలన వారి భౌతిక శరీరం వెళ్లిపోయేటపుడు ఎంతో హృదయవిదారకంగా ఉంటుంది. దాని స్థానంలో కాలక్రమాన సాంప్రదాయం వస్తుంది. కనుమరుగైంది భౌతిక శరీరం మాత్రమేనని తెలుసుకుని వారు ఆ మహాత్ముని సాన్నిధ్యాన్ని వేరేవిధంగా ఇంకా ఇంకా అనుభవించగలుగుతారు.

నేను ముందు చెప్పినట్లు, ఓ మహాత్ముని మరణం – అది మరణం అని అనుకుంటే – కొంతమంది మహాత్ముల విషయంలో వారి మహిమ మరియు వారి అవతారకార్యం యొక్క విస్తృతికి నిదర్శనం. అందువల్ల వారు దేహత్యాగం చేసిన రోజును సంతాపదినంగాకాక ఉత్సవంలా జరుపుకుంటారు. ఒకవేళ మహాత్ముని మరణానికి సంతాపం పాటించవలసివస్తే అసలు ఆయన మహాత్ముడే కాదు, కారణం మహాత్ములకు మరణం అంటూ ఉండదు కనుక. అందుకే దానిని వర్ధంతి అంటారు. **వర్ధ అంటే పెరిగేది, విస్తరించేది, వికసించేది – పెరగడం అన్నమాట.** దేహత్యాగంతో భౌతికమైన పెరుగుదల ఆగిపోవచ్చు. కాని వారి ద్వారా ప్రకటమయ్యే మహత్వ ప్రభావం ఆగిపోదు (ఇంకా ఎక్కువవుతుంది). కాబట్టి వాస్తవానికి ఆయన మరణించలేదు.





**భక్తుడు** : గురువుగారూ! ఎవరైనా మరణించిన తరువాత ఎక్కడకు వెళతారు? ఏం జరుగుతుంది అని తెలుసుకోవడం సాధ్యపడుతుందా?

**గురువుగారు** : అవును, తెలుసుకోవడం సాధ్యమే

**భక్తుడు** : మరి ఎలా తెలుసుకోగలం?

**గురువుగారు** : ఇపుడు ఇక్కడ ఉన్నదేదో తెలుసుకుంటే, నీ ఆత్మ గురించి ముందు తెలుసుకుంటే (అది కూడా తెలుసుకోవచ్చు) నీ ఆత్మ ఎక్కడ ఉందో నీకు తెలుసా? ఉంటే ఎక్కడ ఉంది? ఎలా ఉంది? ముందు దాని గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించు.

**భక్తుడు** : గురువుగారూ! బాబా "మీరు నన్ను ఆనంద స్వరూపంగా ధ్యానించలేకపోతే నా రూపాన్ని ధ్యానించు" అన్నారు. మాలో రూపంతో అనుబంధం వున్న భక్తులు వారి గురువు మహాసమాధి చెందితే వారు అనాథలమైపోతామని భావిస్తారా లేక వారి గురువు రక్షణలో ఉన్నామని భావిస్తారా?

**గురువుగారు** : నేను బాబా రూపంతో ఆనందానుభూతిని పొందినది ఆయన మహాసమాధి అనంతరమే.

**భక్తుడు** : కానీ మీరు బాబా సజీవరూపాన్ని చూచివుంటే మీ అనుభవం ఎలా ఉండి ఉండేది?

**గురువుగారు** : అది ఇంకా గొప్పగా ఉండి ఉండేది. ఎందుకంటే బాబా భౌతికదేహం కానే కాదని తొలి సందర్భంలోనే ఒక్కసారి చూడగానే తెలుసుకోగలిగేవాడిని. నా దురదృష్టవశాత్తూ, బాబాను చూడటానికి ఆయన ఫొటో మాత్రమే వుంది కనుక కొంతకాలపాటు నేనాయన రూపాన్ని అంటిపెట్టుకొని ఉండవలసి వచ్చింది. కాని ఏ క్షణాన్నయినా బాబా మనకు అదే అనుభవం ఇవ్వలేకపోతే ఆయన ఎవరని (ఎవరై ఉండాలి)

ఏదేమైనా ప్రస్తుతాన్ని గురించి ఆలోచిద్దాం (గురువుగారు నవ్వుతూ) ఒకవేళ మనము ఈ అన్ని రూపాలు అనిత్యాలు, ఏ రూపమైనా కాస్త ముందు వెనుకగా మాయమవుతుంది అని ఎరిగి ఉంటే దీని నుండి (ఆ ఎరుకవల్ల) ఆ రూపం రూపాతీత స్థితికి ఒక సాధనం మాత్రమేనని మనం రూపం యొక్క విలువ అవగతం చేసుకోవాలి (చేసుకోగలం). అందుకే నేను, కిటికీ చట్రాన్ని (ఆకారాన్ని) చూడకండి, కిటికీనే చూడండని కిటికీ ఉదాహరణగా చెప్తాను.

**భక్తుడు** : కానీ మనకు తొలుత చట్రం మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది కదా!

**గురువుగారు** : మొదట అది చట్రంతోనే ప్రారంభమవుతుంది. కాని అక్కడే ఆగిపోవద్దు. ఊరికే ఇంకా ఇంకా కిటికీ గుండా చూడండి. కిటికీ మీద లగ్నం చేస్తే అదే మిమ్మల్ని కిటికీ అవతలకు తీసుకుని వెళుతుంది.

**భక్తుడు** : కానీ ఒకవేళ చట్రంతో మేము ఆనందంగా ఉంటే?...

**గురువుగారు** : అయితే చట్రంతోనే సంతోషపడండి!

**భక్తుడు** : ఆధ్యాత్మికతలో సాధారణంగా సాకారానికంటే నిరాకారానికి ప్రాముఖ్యత ఉంటుంది ఎందుకు?





**గురువుగారు** : కారణమేమీ లేదు, రూపం కూడా అంతే విలువైనది, అంతే ముఖ్యమైనది. కాదని ఎవరన్నారు? ఇప్పటికీ నేను బాబాను పూజిస్తాను. ఆయన రూపాన్ని చింతన చేస్తాను. నాకు సాకారంతో ఎటువంటి ఇబ్బంది లేదు. అలాగే నిరాకారంతో కూడా లేదు. (గురువుగారు నవ్వుతున్నారు)

**భక్తుడు** : కానీ రూపాన్ని దాటి నిరాకారాన్ని చేరుకోవాలి అని మేమెప్పుడూ వింటుంటాం..

**గురువుగారు** : బాబా రూపం ఒక రూపమే కాని ఆ రూపం ఇచ్చే ఆనందం ఎప్పుడూ రూపరహితం. ఆనందానికి నీవు ఏ రూపాన్ని ఇవ్వగలవు? ఒకే సమయంలో రెండూ ఉంటాయి. నీవు బాబా కేసి చూసినపుడు నీకొచ్చే ఆనందానుభూతి రూపరహితం. బాబా కూడా ఇదే విషయాన్ని **"నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించు. నీకది సాధ్యపడకపోతే నా రూపాన్ని ధ్యానించు"** అని చెప్పారు. కానీ నీవు రూపం మీద దృష్టి నిలుపగానే మళ్లా ఆనందాన్నే ధ్యానించడం మొదలవుతుంది. (గురువుగారు నవ్వుతూ) అదే మరి బాబా అంటే.

**– శరశ్చంద్రికలు–మార్చి**

# సాయిపథం

*సాయిపథం అనంటే?*

బాబా చుట్టూ బాబాను ఆధారం చేసుకొని బాబా కేంద్రంగా మనకై మనసు, హృదయము ఎమోషన్స్ అల్లుకున్నటువంటి పథం Path, Way అది సాయిపథం అంటే. అది మన జీవితంలో ఒక భాగం కావటం కాదు, మన జీవితమే దాంట్లో భాగం కావాలి, మనం ఏమి చేసినా, ఏమి ఆలోచన చేసినా అది సోకాల్డ్ ప్రాపంచికము కావచ్చు, అది ఆధ్యాత్మికము కావచ్చు, ఏదైనా సరే బాబాను కేంద్రంగా చేసుకునే ఉండాలి. మన ఆలోచనలు, మనం చేసే పనులు, మన జీవితమంతా అదే సాయిపథం అంటే.

సాయిపథం అంటే కూర్చుని భజన చేయడం, లేకపోతే నామము చేసుకోవడం, పారాయణ చేసుకోవడం మాత్రమే కాదు. ఎలా ఉండాలంటే బాబా యొక్క స్ఫురణ మనలో సముద్ర ఘోషలాగ ఉండాలి. సముద్రఘోష మనకి వినిపిస్తూ ఉంది, నేను మాట్లాడినంత వరకు నా మాటలు వింటున్నారు. సముద్రఘోష మీరు వినటం లేదు కదా! కాని వింటున్నారు, ఒక రకంగా చెప్పాలంటే వింటున్నారా, వినలేదా? మీకు వినిపిస్తుంది, మీరు వినటంలా?. నా మాటలు ఆపగానే సముద్రఘోష వినిపిస్తుంది. మళ్లా నేను మాట్లాడటం మొదలుపెట్టగానే నా మాటలు వినిపిస్తాయి. బాబా యొక్క స్ఫురణ సముద్రఘోషలా ఉంటే మనం చేసే ఉద్యోగము, మన జీవితంలో మనకుండేటటువంటి మన ఫ్యామిలీ వ్యవహారాలు ఇవన్నీ కూడాను, నా మాట్లాడే మాటల్లాగే ఉంటాయి. వ్యవహారం ఆగంగానే మనసు సముద్ర ఘోషలాగా బాబా స్మరణలో నిలిచిపోవాలి. అది సరైన పద్ధతి.





అపుడు మనం ఇన్ని చేస్తున్నా కూడా అది ఉంది. అది ఉండటం వల్లనే, ఆగంగానే వినిపించటం మొదలవుతుంది. మనం ఏమీ చేయకుండా, ఈ మనసు ఎటూ పోకుండా, నిలుచున్నపుడు బాబా మీదనే నిలవాలి, సెంటర్ అవ్వాలి, అది సెంటర్ అంటే, అది కష్టం, దాన్ని సాధించండి. అది నిజమైన సాయిపథం అంటే, మనం ఎంత ఎవాల్వ్ (Evolve) అవుతున్నాము. ఒక Human Beingగా. The process of evolution అది నాకిష్టం. నా దృష్టిలో సాయిపథం అంటే అది, బాబా పథం అంటే అది. దానికి అనుగుణంగా ఆర్గనైజ్ చేసుకునేదేదైనా సత్సంగము అవుతుంది. దీన్ని ఎక్స్‌ప్రెస్ చేసేటువంటిది, దీన్ని వర్కవుట్ చేసేటువంటిది, దీన్ని ఇంప్లిమెంట్ చేసేటువంటిది. ఆర్గనైజ్డ్‌గా చేసుకునేప్పుడు కొన్ని తప్పవు. ఒక టైప్ ఆఫ్ ది సోకాల్డ్ రిట్యువల్ అన్నట్టుగా, అవి చేసుకోండి, కానీ ఇది ఎక్స్‌ప్రెస్ కావాలి, రిట్యువల్ కాదు. మీరు చిన్నప్పటి నుండి నేర్చుకున్నటువంటి తంతుల్ని అక్కడ ప్రవేశపెట్టి దాన్ని సత్సంగం అనకండి.

మనం ఏమిటి? ఎందుకు మనం పుట్టాం? దీనికంటూ అసలు ఒక అర్థం ఉందా? ఒక మీనింగ్ ఉందా? ఒక లక్ష్యం ఉందా? మనం ఇలా చూస్తున్నాం, మాట్లాడుతున్నాం, వింటున్నాం, ఎలా మాట్లాడగలుగుతున్నాం? ఎలా వినగలుగుతున్నాం? నీ యొక్క అనుభవమే ఇది. ఆయన కెవరకో బ్రహ్మజ్ఞానం వచ్చింది. ఆయన ఇలా చూసాడు–మనకొద్దు, నా పరిస్థితి ఏమిటి ఇపుడు?

నేను చూస్తున్నాను, వింటున్నాను, మాట్లాడుతున్నాను. ఏం జరుగుతుంది లోపల? అసలు లైఫ్ అంటే ఏమిటి? లైఫ్ యొక్క నేచర్ ఏమిటి? దీనికొక నేచర్ ఉందా అసలు? బాబా అంటున్నారు. ఆయనేదో మమ్మల్ని కాపాడుతాడంటున్నారు. ఎట్లా కాపాడుతాడు? కాపాడితే ఏ రకంగా కాపాడుతున్నాడు మనల్ని? ఈ ప్రశ్నలకి సమాధానం వెతుక్కోండి. మొత్తం లైఫ్ అంతా కూడాను ఒక సెర్చ్, ఒక సీక్, సీక్ ఆన్సర్స్. సాయి అంటే ట్రూత్ అని అర్థం చేసుకొన్నట్లయితే You are seekers of truth, that truth ఈ అన్వేషణ మీలో పెరిగినపుడు అవగాహన పెరుగుతుంది. ఈ అవగాహన ఎంత పెరిగితే అంతగా మీలో మార్పు వస్తుంది. అంతగా Human beings గా ముందు మీరు Evolve అవుతారు. బాబాకు బాగా నచ్చినటువంటి నైవేద్యం, ఆయన ప్రేమగా చూసేటువంటి నైవేద్యం ఏమిటనంటే Real Human Beingలాగ మనం తయారవుదాం, ఒక పండు పెట్టేసి, కళ్లు తుడవడానికి ప్రయత్నం చేయకండి. మనమే నైవేద్యం కావాలి బాబాకి. మనం ఎట్లా నైవేద్యం అవుతామనంటే, రియల్ హ్యూమన్ బీయింగ్స్‌గా, అది సాయిపథం అంటే.





ఎన్నిసార్లు రెగ్యులర్‌గా సత్సంగాలకు పోతున్నామా? ఎంత రికార్డ్ ఉంది నాకు, ఎంత అటెండెన్స్ ఉంది, ఈ అటెండెన్స్ మనకేమీ ఉపయోగపడదు, మనం ఎంత ఎవాల్వ్ అవుతున్నాము? నాలో ఎంత మార్పు వచ్చింది? ఎప్పటికప్పుడు ఏరోజుకారోజు తరచి చూసుకోండి. తరువాత అంతకంటే ముందుగా నేను చెప్పాను, సత్సంగమంటే ఏమిటో, అది నేను చెప్పిన సత్సంగం, అద్దైతే ఈ సత్సంగాలు ఈ రకంగా జరుగుతున్నాయా? లేకపోతే మామూలు రిట్యువల్‌కి, తంతులకి, వీటికి మనం ఇదైపోతున్నామా? పోయి, అక్కడకు పోయి ఒక తంతు చేస్తున్నామా? అనే విషయం మీకు మీరు చూసుకోండి. ఈ స్పిరిట్ ఉండాలి. ఒక జీల్ ఉండాలి. ఒక యెంతూజియాజిమ్ ఉండాలి. ప్రతిసారి సత్సంగానికి పోయి, మళ్లా ఇంకొక సత్సంగానికి పోయే లోపల, మనలో మనకు మార్పు తెలియాలి, మనలో ఉండేటటువంటి మార్పు, నాలో ఈ మార్పు వచ్చింది. నేను ఇది సాధించాను, నాకు అవగాహన వచ్చింది. అనేటటువంటి ఇది రావాలి. అంతే తప్పితే, సత్సంగానికి వెళ్లాలి కదా, తప్పదు కదా, రొటీన్ కదా, మనం పంక్చ్యువల్‌గా ఉండాలి కదా అని పోకూడదు, అపుడు ఎంజాయ్ చేస్తారు. సినిమా ఎంజాయ్ చేసినట్టు చేస్తారు. ఆ వున్న గంటలోంచి ఎంత మనం పొందుతాం, ఎంత లాగేసుకోవాలి బాబా దగ్గర నుంచి, మాగ్జిమమ్ ప్రయత్నం చేయండి. (http://vimeo.com/channels/sribabujiaradhana#18520753 నుండి సంగ్రహం, సాయిపథం సౌజన్యంతో....)

## సర్వవ్యాపకత్వం - సమాధానతత్త్వం

తెనాలి నుండి వ్రాస్తున్నాను. నా పేరు సతీష్‌బాబు, మా అబ్బాయి పేరు చంద్ర సాయిశరత్. 2010 నవంబర్ 14 ఉదయం నేను,మాఅబ్బాయి శిరిడీకి బయలుదేరి నవంబరు 15 శిరిడీ చేరాము. మరికొంత మంది గురుబంధువులతో నవంబరు 15 మధ్యాహ్నం నుండి నవంబరు 16 ఉదయం వరకు సమాధి చేసే స్థలంలో సేవ చేస్తున్నాము. 16వ తేదీ సాయంత్రం గురువుగారు శిరిడీ ఊరేగింపుగా వచ్చినపుడు బాబా సమాధి మందిర ప్రదక్షిణగా వచ్చినపుడు నేను, మా అబ్బాయి పాల్గొన్నాము. 16వ తేది సాయంత్రం సాయియానా హాల్‌లో గురువుగారి పార్థివ శరీరాన్ని దర్శించుకున్నాము. ఆ రోజు గురుసన్నిధిలో ఉన్నాము. నవంబరు 17 బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం 12-1 గంటల మధ్యలో సమాధి కార్యక్రమాలు చాలా దగ్గరగా చూడగలిగాము. ప్రథమ సమాధి ఆరతి సందర్భంగా సాయంత్రం 6.30గం॥ల నుండి 7.00లకు నివాళి, సాయినామ ఆలాపన, ఆరతి అమ్మగారు ఇవ్వడం చూసి శిరిడీలో బస్సు ఎక్కి శిరిడీ దాటామో లేదో గాని నాకు బస్సులో నిద్రపట్టింది. స్వప్నదర్శనంలో గురువుగారు వారి సమాధిలో వారిపై వున్న ఊది, కర్పూరం, ఉప్పు, మట్టి



కలిపి వున్న మట్టిని దులుపుకుంటూ వచ్చి సాయియానా హాలు బయట వున్న మెట్ల దగ్గర కూర్చున్నారు. దీనిలో నుంచి నాకు తెలిసిన అర్ధాన్ని మీ అందరితో పంచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ స్వప్న దర్శనానికి ముందు మా అబ్బాయి అడిగిన ప్రశ్న ఏమిటంటే గురువుగారిని ఇంత ఇదిగా సమాధి చేసిన తరువాత ఇక పైకి వస్తారా! వస్తారా! చెప్పు నాన్నా... అని ఎంతో తపనగా అడిగాడు. ఆ తపనకు సమాధానమా అన్నట్లుగా నాకు స్వప్న దర్శనం అయ్యింది. సమాధిలో నుంచి పైకి వస్తారా? లేదా? అన్న ప్రశ్నకు సమాధానంగా పైకి వచ్చి మా అబ్బాయి ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దీనిలో నుండి నాకు అర్ధమయ్యేలా ఇచ్చిన సమాధానం ఏమిటంటే నన్ను సమాధికి పరిమితం చేస్తారేమో, అలా పరిమితం చేయకండి అంటూ తెలియచేసారు.

నేను గురువుగారిని, సాయిబాబాని చాలా కోర్కెలు కోరుతుంటాను. వారు నన్ను అనుగ్రహిస్తుంటారు. అలాంటి కోర్కెలలో ఒకటి ఏమంటే "నేను చక్కగా గురుసేవ చేసుకోవాలి. అది ఇంతకు మునుపు ఎవరూ చేసినదిగా ఉండకూడదు. నాకు తెలియకుండానే నేను ఆ సేవ చేసుకోవాలి". ఇలాంటి ఈ కోర్కెను గురువుగారు జనవరి 16, 2011న తీర్చారు. ఆరోజు మా ఇంట్లో సాయి నామాలాపన జరిగింది. గురుబంధువులందరికి గురుదేవుల సమాధి రూపాన్ని అందించాను. పవిత్రమైన ఆ రూపాన్ని చూసి అందరూ నమస్సులర్పించారు. తెలిసిన గురుబంధువులందరికీ ఆ రూపాన్ని అందించాను. ఆ రూపాతీతుని సమాధానరూపం అందరికీ అందించే అవకాశం ఇచ్చి, నాకు తెలియకుండానే నా కోర్కె తీర్చారు. ఈ లీలను మీతో పంచుకునే అవకాశం ఇచ్చిన పూజ్య గురుదేవులకు, శ్రీసాయికి నమస్కరిస్తూ...

## సాయి 'లీలామానుషుడు'

పూజ్య గురుదేవుల పాద పద్మములకు నమస్కారములు తెలుపుకుంటూ, నా పేరు పద్మశ్రీహరి, విజయవాడ. మా వివాహం 1986 డిసెంబరు 7న జరిగింది. నేను మొదటిసారి గురువుగారిని దర్శనం చేసుకున్నది కూడా ఈరోజే. మా వివాహానికి గురువుగారు వచ్చారు. మా వివాహం అయిన తరువాత మేము మొదట గురువుగారి పాదాలకు నమస్కారం చేసుకొని గురూజీ ఆశీస్సులు తీసుకున్నాము. అపుడు నాకు గురువుగారి మీద ఎటువంటి భావన లేదు. వివాహం అయిన తరువాత బాబా, గురూజీల గురించి ఏమైనా చెప్పమని మా వారిని అడిగినపుడు సచ్ఛరిత్రను చదవమని చెప్పారు. సచ్ఛరిత్ర మొదటిసారి చదివిన నేను బాబా దగ్గర జరిగిన లీలలో ఏదైనా ఒక లీల నాకు కూడా జరిగితే అపుడు నేను మిమ్మల్ని నమ్ముతాను గురువుగారు అని గురూజీకి చెప్పా. నెలరోజుల పాటు గురూజీని అడుగుతూనే ఉన్నాను.నెల రోజుల తరువాత గురుదేవులను అనుకోకుండా గుంటూరులోదర్శనం చేసుకున్నాము. గురూజీని దర్శనం చేసుకున్నపుడు, గురూజీ నన్ను "భోజనం చేసావా" అని అడిగారు.



లేదని చెప్పాను. "వెళ్ళి భోజనం చేసిరా" అని చెప్పారు. కాని నేను భోజనానికి వెళ్లలేదు. కారణం మా అత్తగారి ఇంట పాటిస్తున్న ఏకాదశి ఉపవాస నియమం. ఆ రోజు ఏకాదశి. గురువుగారు మరలా "భోజనం చేసావా" అని అడగడంతో గురుదేవులకు నా ఏకాదశి ఉపవాస నియమం గురించి చెప్పాను. "ఏకాదశి మనకేం లేదమ్మా" అని గురువుగారు చెప్పడంతో వెళ్లి భోజనం చేసి వచ్చాను. భోజనం చేసి వచ్చిన నాకు వారి ఎదురుగా వున్న ప్లేటులోనుండి కిళ్లీ తీసి ఇచ్చారు గురువుగారు. నేను తీసుకోవడానికి సంశయించడంతో "ఊ! పరవాలేదు వేసుకోమ్మా!" అని చెబుతూ, కిళ్లీ నా చేతికి ఇస్తూ "తెలిసిందా అమ్మాయి" అన్నారు. నాకు ఏమీ అర్థం కాలేదు. ఆలోచించగా, 2,3 రోజుల తరువాత కాని అర్థం కాలేదు. నేను గురువుగారిని అడిగిన కోరిక గురూజీ తీర్చిన విధానము "తెలిసిందా అమ్మాయి" అని అడగడంతో నాకు తెలిసింది గురుదేవులు ఎంత గొప్పవారో, ఎంతటి మహితాత్ములో. నేను గురూజీని అడిగింది. బాబా దగ్గర జరిగిన లీలలో ఏదైనా ఒకటి నాకు కూడా జరగాలని. గురుదేవులు నాకు ప్రసాదించిన ఈ అనుభవం "బాబా నాచ్నేను ఏకాదశినాడు ఉపవాసం మాన్పించి భోజనం చేయించి, తాంబూలం కూడా ఇచ్చిన అనుభవాన్ని" గుర్తుకు తెస్తుంది. ***-పద్మశ్రీహరి, విజయవాడ***

## చెప్పింది చెయ్యండయ్యా!

బాబాకు, గురుదేవులకు నా హృదయపూర్వక నమస్కారములు. నా పేరు లక్ష్మి. మాది వెంటూరు గ్రామం. ఇక్కడ సత్సంగం మొదలు పెట్టినప్పటి నుండి బాబా, గురుదేవులు నాకు ఇచ్చిన అనుభవాలు ఎన్నో, ఎన్నెన్నో. వాటిలో ఒకటి మీతో పంచుకునేందుకు ఇక్కడ వ్రాస్తున్నాను. 2010 జనవరి నుండి గురుదేవుల దర్శనాలు ఆగిపోయినప్పటి నుండి ఏదో కోల్పోయినట్టుగా మనస్సుకు చాలా బాధగా ఉండేది. వారు ప్రతిక్షణం మనతోనే ఉన్నారన్న ఎరుకనుండి కాసేపు మరపులోకి పోయి గురువుగారు ఎక్కడో దూరంగా అరుణాచలంలో వుంటారు. మన అందర్నీ వదిలేసి వారు ఏమి చేస్తూ ఉంటారనే ఆలోచన, వారు ఏమి చేస్తున్నారో చూడాలని వింతకోరిక కలిగాయి. (అది తప్పు అని తెలిసినా, దర్శనాలు లేవనే బాధతో) తరువాత దాని గురించే ఆలోచిస్తూ ఈ విషయం నెమ్మదిగా మరచిపోయాను. నేను మరచినా నా తండ్రి మరువరు. నా బిడ్డకు సమాధానం ఇవ్వాలి అన్నట్టుగా పది రోజులకు గురుకృప పుస్తకంలో సూటిగా దానికి సమాధానం ఎవరో ఒక శిష్యునికి తన గురువుపట్ల ఇలాంటి సందేహమే కలిగితే దానికి ఆ గురువుగారు సమాధానమే నాకు గురువుగారి సమాధానం. అదేమిటంటే "నేనేమి చేస్తున్నానో నీవు చూడడం మొదలుపెడితే నీవు ఎందుకు వచ్చావో అది మరచిపోతావు. నా గురుదేవులు ఏమి చేస్తున్నారో నేనెపుడూ చూడలేదు. వారు ఏది చెప్పారో అది చేశాను. అందుకే వారు ఏం పొందారో అది పొందగల్గినాను. నీవు నేనేమి చేస్తున్నానో చూడడం మానేసి నేనేమి చెప్పానో అది చేస్తే నా గురువు వల్ల నేను ఏమి పొందగల్గినానో అది నీవు పొందగలవు. **అనుగ్రహం అనేది తీసి ఇచ్చే వస్తువు కాదురా! అది**





**గురువును మెప్పించి పొందవలసింది**. జ్యోతిని వెతుకుతూ వచ్చి జ్యోతిని చూడడం మరచి జ్యోతి చుట్టూ క్రింద పడే నీడను చూడడం మొదలుపెడితే ఆ నీడలో నీవు కూడా ఒక నీడగా కలిసిపోతావు ఆలోచించుకో, నిర్ణయం నీ ఇష్టం"! అని.

నాకు కలిగిన వింత కోరికకు ఖచ్చితంగా ఇదే గురువుగారి సమాధానమని భావించి, గురుదేవులను క్షమాపణ అడిగాను. తరువాత ఆ గురుదేవులే నా ఆలోచన మరిచేలా చేసి నాకు చక్కటి దారి చూపించారు. (బాబా నామం, సచ్చరిత్ర, పారాయణ). మన మధ్య బాబా భౌతికంగా లేకపోయినా వారి స్మరణలో ఎలా కాలం గడుపుతున్నామో అలాగే నేడు కూడా గురుదేవులు భౌతికంగా మన మధ్య లేకపోయినా సర్వాంతర్యామి అయిన ఆ సద్గురుమూర్తి ప్రతిక్షణం మనల్ని చేయిపట్టి స్వయంగా నడిపిస్తున్నారనే ప్రగాఢ విశ్వాసంతో వారు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ బాబా గురుదేవుల నామస్మరణలో మా జీవితాలు ధన్యం కావాలని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. గురుదేవులకు హృదయపూర్వకంగా సాష్టాంగ నమస్కారాలు సమర్పించుకుంటున్నాను. ***– డి. లక్ష్మి, వెంటూరు***

## గురువుని నమ్మండి చాలు

"శ్రీ సాయినాధుని శరత్‌బాబూజీ 13.11.2010 శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు మహాసమాధి చెందారు", అని అదేరోజు సాయంత్రం పూల ప్రసాద్‌రావుగారు (సాయియానాలో డయాస్ పూలు డెకరేషన్ చేసే అంకుల్) మాకు 6.30 గం॥లకు ఫోన్ చేసి తెలిపారు. మరుసటిరోజు ఉదయం నలుగురం కలసి ప్రసాదరావు అంకుల్ వాళ్ల ఇంటికి వచ్చాము. అక్కడి నుండి ఒక కారు మాట్లాడుకొని అంకుల్ వాళ్ల ఫ్యామిలీ, మా ఫ్యామిలీ కలసి శిరిడీ బయలుదేరాము. సోమవారం ఉదయం ఐదు గంటలకు సాయిపథంకి చేరాము. ఆ తరువాత రూమ్‌కి వెళ్లిపోయాము. మరుసటిరోజు అనగా మంగళవారం పది గంటలకు సాయిపథంకి వచ్చి పూలు అల్లుతూ కూర్చున్నాము. అంతలోనే ప్రసాదరావు అంకుల్ మా అందరిని పిలిచి, బాబూజీ అంబులెన్స్ వస్తుంది. మనం కోపర్‌గాం దగ్గరకు వెళ్లి, అంబులెన్స్‌కి డెకరేషన్ చేయాలి అని కారులో పూలని, మమ్మల్ని తీసుకుని వెళ్లారు. అక్కడికి మేము వెళ్లేసరికే గురువుగారి అంబులెన్స్ వచ్చి ఉంది. మేము తొందర తొందరగా డెకరేషన్ చేస్తున్నాము. అపుడు మాతోపాటు మా చిన్నబాబు ఆరు సం॥ల వాడు కూడా అంబులెన్స్‌కి పూలు వేస్తూ అటూ, ఇటూ తిరుగుతూ ఉన్నాడు. మాతోపాటు గురువుగారి పాప శృతి, ఇంకా ద్వారకా అంకుల్ ఇంకా కొంతమందిమి కలసి డెకరేషన్ చేసాము. ఇక అయిపోయింది బయలుదేరుదాము అనేసరికి, ఒక కారు అంబులెన్స్ ముందు వున్న మా చిన్నబాబుని చాలా వేగంగా వచ్చి తాకింది. ఆ స్పీడుకి మా బాబు ఒక మూడు కార్ల దూరంలో గాల్లో అలా ఎగిరిపడ్డాడు. అసలు ఏం జరిగింది అని మేము అంబులెన్స్ వెనుక నుండి వచ్చి చూసి షాకయిపోయాము. మాకు నడవడానికి కూడా శక్తి రావడం లేదు. వాళ్లే మా





బాబుని వాళ్ల కారులో తీసుకుని షిరిడీ సంస్థాన్ హాస్పటల్‌కి తీసుకువెళ్లారు. వాళ్లు అక్కడ మా బాబుకి అన్ని పరీక్షలు చేసి "అసలు ఏం జరుగలేదు, కొంచెం వెనకాల రాసుకుపోయింది అంతే ఇంకేం ప్రమాదం లేదు" అని చెప్పారు. గురువుగారు నా బిడ్డను ఎంత జాగ్రత్తగా కాపాడారంటే, కారు తాకగానే వాడిని ఆ క్షణంలో ఎత్తుకొని ప్రక్కన అలా పడుకోబెట్టారు. అది జరిగిన ప్రాంతం, సందర్భం చూస్తే ఎవరికి మాటలు కూడా రాలేదు. గురువుగారికి మా మీద ఎంత దయ. మనము ఎవరిని నమ్మినా, నమ్మకపోయినా, గురువుని నమ్మితే చాలు మన జీవితాలలో అన్నీ ఆయన జరిపిస్తారు. ఆయన ప్రేమ తల్లి ప్రేమ కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ. ఆయన ప్రేమ అంతం లేనిది. అవధులు, పరిమితి లేనిది. అనంతమయిన ప్రేమతత్వం ఆయనది. మాకు 3 సం॥ల క్రిందట గురువుగారి పరిచయం జరిగింది. మేము చాలా క్లిష్ట పరిస్థితులలో వున్నాము. అప్పటి నుండి ఆయన మమ్మల్ని అన్ని విధాలుగా ఎంతో జాగ్రత్తగా కాపాడుతున్నారు. గురుబంధువులందరికీ ఒక చిన్న మనవి– దయచేసి గురువుగారు దేహంతో లేరు అని మాత్రం బాధపడవద్దు. ఆయన సజీవంగా మన ముందు లేకపోయినా, సమాధి చెందిన తరువాత కూడా వెయ్యిరెట్లు ఎక్కువగా కాపాడుతున్నారు. ఇది నా స్వానుభవం. అంబులెన్స్ శిరిడీ రాకముందే, మొట్టమొదటలీలలో నా బిడ్డకు భాగం (భాగ్యం) కలిగించారు. ఇంత గొప్ప అనుభవం గురుబంధువులతో పంచుకునే అవకాశం కల్పించిన గురుకృపకు కృతజ్ఞతలు. *–కె. ఉమాదేవి*

## నంబి

ద్వాదశ శతాబ్దాల నాటిముచ్చట, అప్పటి స్థితిని అర్థం చేసుకోవాలంటే నేటి భారతదేశాన్ని విస్మరించి, ఆనాటి భారతదేశంలో ప్రవేశించాలి. తమిళనాడులో అతి సుందరమైన ఓ గ్రామం. గ్రామం నలుదిశలా సస్యశ్యామలం, ప్రతి గృహం చుట్టూ తోటలు, నారికేళ వృక్షాలు, పోకచెట్లు, ప్రతి వాకిట నీడనిచ్చు వేపవృక్షాలు. గ్రామంలోని ప్రతివారి జీవితం సుఖభరితం. వారు చెట్లకు నీరుపోసి వాటితో సంభాషిస్తారు. వాటిపట్ల వారికి ఎంతో ఆత్మీయత్వం, వృక్షాలతో ఉదారత్వాన్ని, స్థైర్యాన్ని, పర్వతాలతో భవితవ్యాన్ని, సాగరంతో గాంభీరత్వాన్ని అలవరచుకొని ప్రశాంతంగా జీవితాన్ని గడుపుతున్నారు. ఆ గ్రామంలో ఓ బ్రాహ్మణుడు వున్నాడు. అతడు ప్రాతఃకాలంలో భగవంతుని స్మరించడం, సంధ్య వార్చుకోవడం, మొక్కలకు నీరు పోయడం, వాటిని చక్కగా పోషించడం, ఇది అతని దినచర్య. పవిత్రుడు, శీలవంతుడైన అతనికి దైవానుగ్రహం వలన అనుకూలవతి, గుణవంతురాలయిన భార్య లభించింది. ఆనందంగా వున్నారు. వృద్ధాప్య దశలో వారికి ఒక కుమారుడు జన్మించాడు. ఆ బాలునికి నంబి అని పేరు పెట్టారు. నంబి చురుకైనవాడు. నంబియే వారి వైభవం. తల్లి బిడ్డను ఎత్తుకుని, ఉయ్యాల్లో పడుకోబెట్టి, వానిలో జ్ఞానసంస్కార బీజాల్ని నాటుతుంది. నీతి కథలతోపాటు, చిన్న చిన్న శ్లోకాలు నేర్పేవారు. అలా తల్లిదండ్రులొసిగిన జ్ఞానం ప్రస్తుతం పిహెచ్‌డి కంటే నయం. అలా బుద్ధి వికసిస్తుంది. అబ్బాయ్ చెట్లను ఆదరించాలి. వాటిలో దేవుడున్నాడు. వాటిలో కూడా శక్తి వుంది అనేవాడు





తండ్రి. నంబికి తల్లిపై ఎంతో అనురాగం. ఐదేళ్ల వయస్సులో నంబి వేదదీక్ష, ధ్యేయనిష్టాన్ని కలిగించుటకు ఉపనయన సంస్కారం చేసి, బడికి పంపారు. ఓనాడు నంబి తన తల్లితో "నీవు రాగి వృక్షానికి ప్రదక్షిణ చేస్తూ నన్ను కూడా చేయమన్నావు. అలా చేస్తే నా తోటివారు నన్ను ఎగతాళి చేస్తారని సంకోచించాను. **సత్కార్యాలు మరియు సత్యాన్ని పాలించు సమయాన బిడియం చెందకూడదని, వెనుకాడకూడదని, చెడు మరియు అసత్య వ్యవహారాలలో సిగ్గుపడాలని బోధించావు.** అమ్మా! ఇంతటి చక్కటి జ్ఞానాన్ని అక్కడ ఉపదేశించే వారెవరున్నారు. నేను బడికి వెళ్లను" అన్నాడు. ఆ తల్లికిది ఓ పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుత కాలంలాంటిది కాదు ఆ కాలం. ఆ రోజుల్లో అన్నానికి కొదువలేదు. అన్నానికి, చదువుకి సంబంధం లేని కాలమది.

అయితే, ఆ రోజుల్లో జీవిత వికాసానికి, సద్గుణాలు పెంపొందించడానికి, అంతర్గత, సుషుప్త శక్తుల్ని మేల్కొల్పడానికి ఉపయోగపడే విద్యను బోధించేవారు. ఎడ్యుకేషన్ అన్న ఆంగ్ల పదానికి అర్థం To drawout. అనగా అంతర్గత శక్తుల్ని బయటకు లాగుట. నేను బడికి వెళ్లను అంటున్న బిడ్డకు తల్లి నచ్చచెప్పే విధానం. ఆ తల్లి కుమారున్ని తన ఒడిలోకి తీసుకుని "నాయనా! నీకు నా మాటలు నచ్చుతాయి కదా! నీవు నా మాటల్ని గంటల తరబడి వింటావు కదా! నీకు నాపై అత్యంత అనురాగముంది కదా! మరి మన అందరి (నీ తల్లినైన నాకు, నీకు, అందరికి) తల్లి ఆకాశాన వుంది (సర్వవ్యాపకత్వం). ఆమెను 'జగదాంబ' అంటారు. ఆ తల్లి మనల్నందర్ని ప్రేమిస్తుంది. నా మాటల్ని ఎలా వింటావో ఆ తల్లి మాటలను కూడా ఆలకించేందుకు 'వేదాధ్యయనం' చేయాలి. ఆ జగదాంబ చెప్పేవి అర్థం చేసుకునేందుకు, ఆచరణకు సద్గ్రంథం ఉపకరిస్తుంది. అందుకోసం నీవు విద్యాలయానికి వెళ్లాలి అన్న తల్లి అనురాగభరిత మాటలు హృదిన నిలువగా విద్యాలయానికి వెళ్లసాగాడు. సద్గ్రంథం ఎందుకు పఠించాలి? అన్న దానికి సమన్వయంగా తోస్తుంది. నంబి ఇంటి వెనుక జీర్ణ గణపతి ఆలయం వుంది. మందిరానికి ఎవరూ వెళ్లరు. కాని నంబి తండ్రి నిత్యం ఆ దేవున్ని పూజిస్తాడు, నైవేద్యం పెడతాడు.

పూర్వకాలంలో ఇంటి యజమాని ఎక్కడికైనా వెళ్లవలసి వస్తే రెండు పనులను ఇతరులకు అప్పగించి వెళ్లేవారు. ఒకటి మొక్కలకు నీళ్లు పోయడం, రెండు దైవాన్ని పూజించడం. తండ్రి ఊరు వెళుతూ భార్యతో "నంబితో దేవునికి నైవేద్యం పెట్టించమని" చెప్పి వెళ్లాడు. నంబి నైవేద్యం తీసుకుని వెళ్లి, ఆరగించమని వేడాడు. కాని గణపతి కదలలేదు, నంబి ఏడుస్తూ "నీవు ఆరగించకుంటే నీ పాదాలపై నా తల బ్రద్దలు చేసుకుంటానంటూ" పాదాలపై కొట్టుకోసాగాడు. నంబి నిశ్చల, నిర్మల ప్రేమ, శ్రద్ధకు భగవంతుడు లొంగిపోయాడు. నైవేద్య సమర్పణ, భగవానుని స్వీకరణ, ఏకనాధుని వృత్తాంతంలోలా ఎవనిచే తల్లి కృతార్థులాయెనో, భూమి పుణ్యవతి ఆయెనో, అట్టి సుతుని గన్న తల్లి జన్మం ధన్యం. అలా గణపతి దేవుడు ప్రత్యక్షంగా నైవేద్యాన్ని భుజిస్తుంటే నంబి కళ్లప్పగించి చూస్తున్నాడు. అతనికి వింతగా తోచలేదు. అతనికి కలిగిన ఆనందమొక్కటే తన తండ్రిలా తాను కూడా నైవేద్యాన్ని తినపించగల్గానని. అఘటనీయమైన ఘటం నంబికి సామాన్యంగా తోచింది. భగవంతుడు



## సర్పులను, సర్వాన్ని బాబాగా దర్శించిన పురుషోత్తముడు



పళ్లెంలో వున్నదంతా ఆరగించాడు. అయినను నంబి అక్కడ నుండి కదలలేదు. అప్పటివరకు నంబి కళ్లలో ఆర్తత ఉంది. ఇప్పుడు భయం ద్యోతకమయింది. నంబి ఇలా అన్నాడు "స్వామీ! మీరు భోజనం చేయడంలో ఆలస్యం చేసారు. పాఠశాలకు వెళ్లడానికి నాకు ఆలస్యమయింది. గురువుగారు శిక్షిస్తారు" అని. "నిన్నెవరూ శిక్షించరు, నిర్భయంగా పాఠశాలకు వెళ్లు" అన్నారు స్వామి. అయినా, నంబి అక్కడ నుండి కదలక, "మీరు విద్యావేత్తలని మా నాన్నగారు చెప్పారు, అది నిజమే అయితే మీరే నాకు బోధించండి. పాఠశాలలో పెద్ద పెద్ద కళ్లున్న అధ్యాపకులంటే నాకు భయం దేవా! మీరయితే మా ఇంటివారే కదా! నేను ప్రతిరోజూ మీకు స్నానం చేయిస్తాను. భోజనం పెడ్తాను, మీరు నాకు చదువు చెప్పాలి". అలా భగవంతుడు పాపరహిత ప్రేమ తాటితో బంధింపబడ్డాడు. సరేలే అన్నారు స్వామి. ఇక మరుసటిరోజు నుండి ఆలయానికి వెళుతున్నాడు బడి ఎగ్గొట్టి. అతన్ని గమనిస్తున్న తల్లి అతన్ని వెంబడించింది. ఆలయం దగ్గరకు రాగానే ఏదో ధ్వని వినిపించింది. ఒక ధ్వని నంబిది – మరియొక ధ్వని గణపతిది. నంబి ప్రశ్నిస్తున్నాడు – గణపతి ప్రత్యుత్తరమిస్తున్నాడు. ఆ తల్లి భగవంతుని వాణిని ఆలకించింది. లోనికి వెళితే చదువుకు ఆటంకమని భావించి బయటనే నిలుచుంది. మధ్యాహ్నం భర్త ఇంటికి వచ్చి నంబి గూర్చి ప్రశ్నించగా "మన నంబితో భగవంతుడు ఆకర్షింపబడ్డాడు" అనగా అర్థం అయ్యేట్లు చెప్పు అన్నాడు భర్త. గణపతి దేవుడే స్వయంగా నంబికి బోధిస్తున్నాడు" అంటుంది భార్య. నీకు పిచ్చెక్కలేదు కదా! దేవుడు ఎలా బోధిస్తాడు" అంటాడు భర్త. నేను స్వయంగా భగవంతుని పలుకులు విన్నాను. మీరు ఈ విషయం ఎవరితోనూ చెప్పకండి. చెబితే జనులు నంబిని పూజించడం మొదలుపెడతారు. దానితో వాని చదువుకు భంగం కలుగుతుంది. భార్యాభర్తలిరువురూ మరసటి రోజు కుమారున్ని వెంబడించి, దూరం నుండే వినాయకుని మధుర గంభీర పలుకుల్ని విని కృతకృత్యులయ్యారు. వారు ధర్మానిష్టాపరులు కనుక వారు ఆలయంలో ప్రవేశించుటకుగాని, కిటికీ గుండా చూచుటకు కూడా ఇచ్ఛగించలేదు. వారికి పరమాత్మయందు పూర్ణవిశ్వాసముంది. సంస్కార బలం మీద శ్రద్ధ, విశ్వాసమున్నాయి. అర్హులైన నాడు పరమాత్మ పలుకరిస్తాడని తలచారు. అర్హతలేనిదే భగవంతుని సమీపించుట శోభించదు. అట్టి సంయమనము గలవారు, నిష్టాపరులు.

నంబి కూలంకషంగా విద్యనభ్యసించాడు. బుద్ధికి దేవుడైన గణపతి నుండి అతడు దివ్యమైన జ్ఞానాన్ని (బుద్ధి) పొందాడు. అట్టి జ్ఞానాన్ని తనలో జీర్ణించుకుని తన జీవితాన్ని గడపసాగాడు నంబి. నంబి పెద్దవాడయ్యాడు. గృహస్థాశ్రమంలో ప్రవేశించి, స్నేహమందు జీవితాన్ని గడపసాగాడు. తన దివ్యమైన జీవన జ్యోతితో (జీవన విధానంతో) ఇతరుల జీవన జ్యోతులను (జీవితాలను) ప్రజ్వలింప చేయసాగాడు. అలా సమాజానికి భక్తిమయమైన, దివ్యమైన, భవ్యమైన జీవిత ప్రణాళికను సమర్పించి, భారతదేశాన్ని పునీతం చేసి, విశ్వేశ్వరునితో లీనమైనాడు నంబి. తమిళనాడులో నేటికి నంబిని ప్రార్థించిన తరువాతనే తరగతిని ఆరంభిస్తారు. ఆ మహానుభావుడు జ్ఞాన భాండారాన్ని పంచి తమిళనాడుని సంస్కరించి, తరింపచేసాడు. ఇలాంటి పుణ్యభూమిలో పుట్టడం మన సుకృతం.

– గురుకృప



# *Guruji is there for us!*



His one Affectionate smile is enough,
For us to forget the whole world,
And live in the joy forever that He smiled at us....

His state is so kingly,
That his one call is enough,
For us to leave the whole world and
Serve him forever.
The whole universe says to him,
That you are the one and only God for us.
And He, smiling at; his thought of ours
Says, " Sai Baba is the God and
I too worship him",

His love, grace and blessing
Are always with us
So we live life without any fear, as we have
Our beloved GURUJI to show us our path.
He is always there for us
No matter what happens.
And I always wish for only one thing,
That I must be with my Guruji
forever and ever.

- CARLOSKARNA